


ఆంధ్రజ్యోతి విజిట్



జిల్లాలోని వసతి గృహాల వివరాలు

వసతి గృహాలు	సంఖ్య	విద్యార్థులు
బీసీ సంక్షేమ	19	1,820
ఎస్సీ సంక్షేమ	31	4,500
ఎస్టీ సంక్షేమ	4	650

కరీంనగర్ బీసీ హాస్టల్ లో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

ఇదేనా 'సంక్షేమం'

- సంక్షేమ వసతి గృహాల్లో అడుగడుగునా సమస్యలు
- అధ్వాన స్థితిలో హాస్టల్స్ భవనాలు
- కిటికీలు సరిగా లేక విద్యార్థుల ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. వసతుల లేమితో, అరకొర సౌకర్యాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పడుకునే మంచాలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు. బెడ్‌షీట్లు, బ్లాంకెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారు. అద్దె భవనాల్లో, కొత్తగా నిర్మించిన భవనాల్లో కొంత మేరకు పరిస్థితులు బాగున్నా చాలా వసతిగృహాల్లో టాయిలెట్లు, బాత్‌రూంలు సరిపడా లేక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మెనూ కొన్ని వసతి గృహాల్లో ఇంకా అమలుకు నోచుకోవడం లేదు. జిల్లాలో 19 బీసీ సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. ఇవన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 31 ఎస్సీ వసతిగృహాల్లో ఒక్కటి మినహా అన్ని సొంత భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. నాలుగు ఎస్టీ సంక్షేమ వసతిగృహాల్లో రెండు అద్దె భవనాల్లో, మరో రెండు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో నడుపుతున్న వసతిగృహాలకు సకాలంలో అద్దె చెల్లించని కారణంగా వసతిగృహాలకు తాళం వేస్తామంటూ యజమానులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం వసతి గృహాలను 'విజిట్' చేసింది. ఈ సందర్భంగా దృష్టికి వచ్చిన సమస్యలపై సమగ్ర కథనం...

➡ పాత భవనాలతో ఇక్కట్లు



చొప్పదండి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉన్న పురాతన భవనం

చొప్పదండి: చొప్పదండి పట్టణంలోని ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. ఆరేళ్ల క్రితం నూతన భవనంలో ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ప్రారంభించగా హాస్టల్ ఆవరణ లోని పాత భవనాలను తొలగించలేదు. పాత భవనాలు శిథిలావస్థకు చేరగా, వర్షాకాలంలో నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. హాస్టల్‌లో ఐదు లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫయర్ చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమతులు చేయడం లేదు. ప్రతి నెల మంచి నీటి కోసం 5 వేల రూపాయలు వెచ్చించి మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు.

● దోమల స్వైర విహారం

వీణవంక: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉన్న మరుగుదొడ్లకు పూర్తిస్థాయిలో డోర్లు లేవు. రాత్రిపూట దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి నివారణకు దోమ తెరలను ఇవ్వాలని కోరారు. మెనూ ప్రకారంగానే భోజనాన్ని అందిస్తున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, ఘన్ముక్ల ఆదర్శ పాఠశాలను సందర్శించగా

మిగతా 8వ పేజీలో...

➡ హాస్టల్ పరిసరాల్లో విష పురుగులు



సైదాపూర్ మండలం సోమారంలో పిచ్చి చెట్ల మధ్య ఉన్న మోడల్ స్కూల్ వసతిగృహం

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ కేజీబీవీలో, సోమారం మోడల్ స్కూల్‌లో వసతీ గృహాలున్నాయి. డ్రైనేజీ సక్రమంగా లేక పోవడంతో కేజీబీవీ వసతి గృహంలోని మురికి నీరు బయటకు పోవడం లేదు. విద్యార్థినులకు బెడ్లు లేక పోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. మోడల్ స్కూల్ వసతిగృహం నిర్మానుష్య ప్రాంతంలో ఉంది. ప్రహరీ లేకపోవడంతో హాస్టల్ పరిసరాల్లోకి విష పురుగులు వస్తున్నాయి. వర్షాకాలం భవనం చుట్టూ నీరు ప్రవహించి జలమయమవుతోంది.

➡ శిథిలావస్థలో హాస్టల్ భవనం



పెచ్చులూడుతున్న బీసీ హాస్టల్ భవనం

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ హాస్టళ్లు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతున్నాయి. జమ్మికుంటలో బీసీ బాయ్స్ హాస్టల్, బీసీ బాయ్స్ హాస్టల్ (కళాశాల), ఎస్సీ మహిళ వసతి గృహం, ఎస్సీ బాలికల హాస్టల్, ఎస్సీ బాయ్స్ హాస్టల్స్ ఉన్నాయి. బీసీ బాయ్స్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పైపెచ్చులు ఊడి పడుతున్నాయి. కొన్ని గదులకు, బాత్‌రూంలకు డోర్లు విరిగిపోయాయి. కిటికీలకు మెష్‌డోర్స్ లేవు. హాస్టల్‌లో రెండు బోర్లు ఉండగా, అందులో ఒకదానికి మోటరు పని చేయడం లేదు. ఎస్సీ బాలికల హాస్టల్, బీసీ హస్టళ్లలో బెడ్లు లేక పోవడంతో విద్యార్థులు కిందనే నిద్రిస్తున్నారు. బీసీ బాయ్స్ హాస్టల్ (కళాశాల) అద్దె భవనంలో కొనసాగుతోంది.

➡ కింద కూర్చునే భోజనాలు



ఇల్లందకుంటలో కింద కూర్చుని భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

ఇల్లందకుంట: మండలంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ ఉన్నాయి. కేజీబీవీలో 275మంది విద్యార్థినులు, ఆదర్శ పాఠశాలలో 32 మంది బాలికలు హాస్టల్‌లో ఉన్నారు. కేజీబీవీ పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. డైనింగ్ హాల్‌లో టేబుల్స్ లేకపోవడంతో విద్యార్థినులు కింద కూర్చునే భోజనాలు చేస్తున్నారు.

మాతా శిశు మరణాలను నివారించాలి

- పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలను నివారించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్యాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికా రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో పని చేసే సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. తమకు నిర్దేశించిన లక్ష్యాలను నెలాఖరులోగా చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం సమయంలో మెడికల్ ఆఫీసర్ ఉన్నది లేనిది రికార్డులో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం సభకు మెడికల్ ఆఫీసర్లు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రతివారం సీడీపీవో, సూపర్‌వైజర్, ఆశా వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వాసు పత్రుల్లో మాతాశిశు మరణాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంల సాయంతో గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు జిల్లాలో సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు 29,712 మందికి ఆరోగ్య మహిళ కింద పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సమావేశంలో ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనాజు వేరియా, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఒ చందు, డీఐవో డాక్టర్ సాజిదా, డీటీటీ పీవో డాక్టర్ ఉమశ్రీ పాల్గొన్నారు.

'పురుమల్ల'పై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు

- మంత్రులపై చేసిన వ్యాఖ్యల పర్యవసానం...
- 30 మంది మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల సంతకాల సేకరణ

కరీంనగర్ క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల డీసీసీ కార్యాలయంలో పురుమల్ల శ్రీనివాస్ తన అనుచరులు, కార్యకర్తలు, కొందరు నాయకులతో రహస్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పురుమల్ల శ్రీనివాస్.. స్థానిక మంత్రితోపాటు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పార్లమెంట్ ఇన్‌చార్జి, టీపీసీసీ అధ్యక్షుడిని తప్పుపడుతూ కొన్ని వాఖ్యలు చేశారు. దీనిని మంత్రితోపాటు హైకమాండ్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఇంటలిజెన్స్ నివేదికతోపాటు వీడియో, ఆడియో క్లిప్పింగ్‌లు కాంగ్రెస్‌పార్టీ పెద్దలు తెప్పించుకున్నట్లు సమాచారం. 30 మంది మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నగర, జిల్లా నాయకుల సంతకాలతో కూడిన ఫిర్యాదును టీపీసీసీ అధ్యక్షుడికి అందించారు. కొందరు ముఖ్య నాయకులు అందుబాటులో లేకున్నప్పటికీ వారి సంతకాలను వాట్సప్‌ద్వారా డిజిటల్ రూపంలో సేకరించి ఫిర్యాదుకు జతపరిచినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల తరువాత తమపై తప్పుడు ఆరోపణలు చేశారని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు గతంలో పురుమల్ల శ్రీనివాస్‌పై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. పురుమల్ల శ్రీనివాస్ ఏ కారణంగా మంత్రులు, నాయకులపై తీవ్ర ఆరోపణలు చేశారని అధిష్ఠానం ఆరాతీస్తున్నట్లు తెలిసింది. ఉజ్వల పార్క్ నిర్వహణ టెండర్‌ను, ఇసుక క్వారీల టెండర్లను మంత్రి వర్గీయులకే కట్టబెట్టారని, డీఎంఎఫ్ నిధులు 2.70 కోట్లు ఒకే రోడ్డుకు కేటాయించారని పురుమల్ల ఆరోపణలు చేశారు. ఇసుక టెండర్లు, ఉజ్వల పార్క్ నిర్వహణ టెండర్లు నిబంధనల ప్రకారమే జరిగాయని చెబుతున్నారు. మంత్రులు, టీపీసీసీ చీఫ్‌పైనే తీవ్ర విమర్శలు చేయడంతో పురుమల్లపై వేటుపడే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతున్నది. నేడో రేపో షోకాజ్ నోటీసు జారీ చేసిన సమాధానం అనంతరం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

వాడీవేడిగా..

- నాలుగున్నర గంటలపాటు బల్దియా సర్వసభ్య సమావేశం
- గ్రామాల విలీనంపై సుదీర్ఘ చర్చ
- సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ల డిమాండ్



మాట్లాడుతున్న మేయర్ వై సునీల్‌రావు
పాల్గొన్న కార్పొరేటర్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరు గ్రామాల విలీనం, డివిజన్లలో నెలకొన్న సమ స్యలు, అధికారుల తీరుపై నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో వాడీవేడి చర్చ జరిగింది. మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహిం చారు. గ్రామాల విలీనంపై గంటన్నరపాటు సుదీర్ఘ చర్చ జరిగింది.

● ఐదేళ్ల క్రితం కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో ఆశించిన మేరకు అభివృద్ధి జరుగలేదని, కొత్తగా ఆరు గ్రామాలను విలీనం చేయడం సరికాదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు అన్నారు.

● విలీనంపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాత చర్చ ఎందుకని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు.

● కాంగ్రెస్ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కల్యాణి శ్రీనివాస్, ఇతర కార్పొరేటర్లు మాట్లాడుతూ గతంలో బీఆర్ ఎస్ గ్రామాలను విలీనం చేసినపుడు ఎం దుకు చర్చ పెట్టలేదని ప్రశ్నించారు. కరీంనగర్‌కు అతిచే రువలో ఉన్న బొమ్మకల్, చింతకుంట, కొత్తపల్లి, దుర్శేడ్, గోపాల్‌పూర్, మల్కాపూర్ గ్రామాలను విలీనం చేస్తే తప్పేంటని నిలదీశారు.

● బీజేపీ కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ మా ట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ గ్రామాల విలీనం చేసినపుడు ప్రజాభిప్రాయం తీసుకున్నారా... ఇప్పు డెందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

● మేయర్ సునీల్‌రావు మాట్లాడతూ మెజార్టీ కార్పొరేటర్లు గ్రామాల విలీనాన్ని వ్యతిరే కించినం దున వారి అభిప్రాయం మేర కు విలీనంపై ప్రభు త్వం పునరాలోచన చేయాలని కోరుతూ తీర్మానించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపిస్తామని ప్రక టించారు. విలీనం చేసే బదులు చింతకుంట, మల్కాపూర్‌ను కలిపి మున్సి పాలిటీగా, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్‌ను కలిపి మరో మున్సి పాలిటీగా చేస్తే ఆయా గ్రామాల అభి వృద్ధి జరిగేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

● సమస్యలపై ఏకరువు

సీఎం హామీ, పట్టణ ప్రగతి రోడ్లను మధ్యలోనే నిలిపివేశారని, ఆ పనులు పూర్తి చేయడం లేదని, స్ట్రీట్ లైట్లు వెలుగక చీకట్లో వీధులు మగ్గు తున్నా యని పలువురు కార్పొరేటర్లు తెలిపారు. మంక మ్మతోట-జ్యోతినగర్‌కు వెళ్లే రోడ్డు, బోయ వాడ, సిక్కువాడ రోడ్లను ఎందుకు బాగు చేయడం లేదని కార్పొరేటర్ జితేందర్ ప్రశ్నించారు. మంచి ఆలో చనలతో కేంద్రం స్మార్ట్ సిటీగా కరీంనగర్‌ను ఎంపిక చేస్తే పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయా యని వంగల శ్రీదేవి పవన్‌కుమార్ అన్నారు. నగర శివారులోని తన డివిజన్‌లో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయని కార్పొ రే టర్ కచ్చు రవి అన్నారు. ఐదేళ్లుగా సమస్యలపై చర్చించినా వాటిని పరిష్క రించలేదంటూ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

● ఎల్ఆర్ఎస్ నిధుల మళ్లింపు చట్ట విరుద్ధం

ఎల్ఆర్ఎస్ నిధుల మళ్లింపు చట్టవి రుద్ధమని మాజీ మేయర్ సర్దార్ రవీం దర్‌సింగ్ అన్నారు. ప్రభుత్వ స్థలంలో క్లబ్‌లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు నిధులు కేటాయించిన అధికారులపై చర్య తీసుకోవాలని, ఎల్ఆర్ఎస్ నిధుల్లో అవినీతి చోటు చేసుకుందని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. తన డివిజన్ నుంచి ఎల్ఆర్ఎస్ నిధులు ఎన్ని వచ్చాయని, వాటిని ఎక్కడ ఖర్చుచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

● గతంలో అవినీతిపై ఇచ్చిన ఫిర్యాదులు ఏమయ్యాయని డిప్యూటీ మేయర్ చల్లాస్వరూపరాణి హరిశంకర్ ప్రశ్నించారు.

● కళాభారతి ఆడిటోరియాన్ని కళాకారులకు ఉచితంగా ఇవ్వాలని, ఇతరుల నుంచి 10 వేల రూపాయల అద్దె తీసుకోవాలని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ సూచించారు. ఉచితంగా ఇస్తే నిర్వహణ కష్టమవుతుందని, కళాకారులకు మూడు వేలకు, ఇతరులకు 10 వేలకు అద్దె ఇవ్వాలని మేయర్ సునీల్‌రావు సూచించి తీర్మానం చేశారు.

వారంలో పెండింగ్ పనులను ప్రారంభిస్తాం
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

సీఎం హామీ పెండింగ్ పనులను వారంరోజుల్లో ప్రారంభిస్తామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. అమృత్-2లో విలీన గ్రామాల్లో 144 కోట్లతో చేపట్టిన మంచినీటి పైపులైను పనులు కొనసాగుతున్నాయని, పారిశుధ్యం పనులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ వంటి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. పాలకవర్గ పదవీకాలం ముగిసేలోగా మరో రెండు సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.


కార్పొరేషన్‌లో విలీనం వద్దు..

- కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన గ్రామాల ప్రజాప్రతినిధులు



కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వినతిపత్రంతో విలీన గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకుల ఆందోళన

కరీంనగర్ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనం చేయొద్దని దుర్శేడ్, గోపాల్‌పూర్, చింతకుంట గ్రామ ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయా గ్రామాలకు చెం దిన పలువురు నాయకులు కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పిం చారు. తమ గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు, నిరుపేదలే ఎక్కువగా ఉన్నారని, కారొ ్పరేషన్‌లో విలీనం చేస్తే ఉపాధి హామీ పనులు లేకుండా పోతాయన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేసి విలీన ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు.



అన్ని రకాలుగా నష్టపోతాం
- మంద రాజమల్లు, గోపాల్ పూర్

కరీంనగర్ నగరపాలక సంస్థలో గోపాల్‌పూర్ గ్రామాన్ని విలీనం చేస్తే అన్నిరకాలుగా నష్టపోతాము.. మా గ్రామం లో ఎక్కువగా ఉపాధి కూలీలు ఉన్నారు. కూరగాయలు సాగు చేసుకుని జీవిస్తున్నాము. విలీనంతో ఉపాధిహామీ పథకం వర్తించకుంటే ఇక చాలా మంది నష్టపోతారు. విలీనం ప్రతిపాదనను విరమించుకోవాలి.



ఉపాధి లేకుండా పోతుంది...
- భూక్యా తిరుపతి నాయక్, మాజీ వైస్ ఎంపీపీ

చింతకుంటను కరీంనగర్ కార్పొరేషన్‌లో కలిపితే కూలీలకు పనిదొరకకుండా పోతుంది.. ప్రభుత్వం విలీనాన్ని నిలిపివేయాలి. ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విలీనం ఆపేయాలని కోరాము.



అభివృద్ధి ఆగిపోతుంది..
- సంపత్ రావు, మాజీ ఉపసర్పంచ్, దుర్శేడ్

కార్పొరేషన్‌లో కలిపితే గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు ఇబ్బంది అవుతుంది. అభివృద్ధి నిలిచిపోతుంది. గ్రామస్థులపై పన్నుల భారం పెరుగుతుంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ పరిధిలో, కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన శనిగారపు మల్లయ్య (80) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో మల్లయ్య ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో వేములవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. మల్లయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మల్లయ్య మార్గమధ్యంలో మృతి చెందాడు. మల్లయ్య కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీణవంక(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బండారి చేరాలు(55) అనే వ్యక్తి మృతి చెందాడు. చేరాలు తన ద్విచక్ర వాహనంపై బేతిగల్ వైపు వస్తున్న క్రమంలో ఓ కారు అతివేగంగా అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బండారి చేరాలుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య బండారి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ధర్మపురి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మామిడి రాజన్న (45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న పెద్ద కొడుకు గణేశ్ మూడు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి రాజన్న మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై కొన్ని రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగాడు. చికిత్స కోసం కరీంనగర్ తరలించగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి రాజన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పవిత్ర తయారు చేసిన హెయిర్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా


తాను తయారు చేసిన హెయిర్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నాను చూపుతున్న పవిత్ర

కొడిమ్యాల్ శిక్షణతో సహజ ఉత్పత్తుల తయారీని ఆదాయ వనరుగా మార్చుకున్నది మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పల్లెర్ల పవిత్ర. ప్రకృతిలో దొరికే పువ్వులు, ఆకులు, వేర్లతో హెయిల్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా తయారుచేస్తోంది. మొదట్లో వ్యాపారంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నా ధైర్యంగా వాటిని అధిగమించింది. ప్రస్తుతం తన ఉత్పత్తుల అమ్మకాల ద్వారా నెలకు పదివేల రూపాయల వరకు సంపాదిస్తోంది. - కొల్లాశీరాంపూర్, ఆంధ్రజ్యోతి

ఆదాయ వనరుగా సహజ ఉత్పత్తులు

- పువ్వులు, ఆకులు, వేర్లతో తయారీ
- డీఆర్‌డీఏ, ఐకేపీ సహకారంతో విక్రయాలు

స్వశక్తి సంఘంలోని పలువురు సభ్యులకు నాలుగేళ్ల క్రితం డీఆర్‌డీఏ, ఐకేపీ అధికారులు హెర్బల్ ఉత్పత్తుల తయారీపై హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా ప్రకృతిలో దొరికే పువ్వులు, ఆకులు, వేర్లతో హెయిల్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా తయారీని నేర్పించారు. అలా శిక్షణ పొందిన స్వశక్తి సంఘ సభ్యురాలైన పల్లెర్ల పవిత్ర ఇంటివద్దనే వాటిని తయారు చేసి విక్రయిస్తూ ఆదాయం పొందుతోంది. 2019లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉత్పత్తుల తయారీలో వారం రోజులు శిక్షణ పొందారు. ఇదువురు శిక్షణ పొందగా ఐదుగురు వివిధ కారణాలతో నిర్వహించకున్నా, పల్లెర్ల పవిత్ర మాత్రం పట్టుదలతో



సహజ ఉత్పత్తులను తయారు చేస్తున్న పవిత్ర

కష్టనష్టాలను ఓర్చి హెర్బల్ ఉత్పత్తులను తయారుచేసి కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, చొప్పదండి తదితర ప్రాంతాల్లోని దుకాణాల ద్వారా అమ్ముతోంది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శిక్షణ పొందిన తర్వాత స్వశక్తి గ్రూపులో రుణం తీసుకొని ఉత్పత్తుల తయారీ కొనసాగిస్తోంది.

● నాలుగేళ్లుగా తయారీ..

ప్రకృతిలో దొరికే తులసి, మందార, కుంకుడుకాయ, ఆలోవేరా, వేపాకు, మర్రిఊడలు, గులాబీ, గోరింటా, గలిజేరు, తుంగగడ్డలు తదితర వాటిని తయారీకి వినియోగిస్తోంది. 2020 మార్చి 8 అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజు అప్పటి కలెక్టర్ దేవసేన పవిత్ర తయారుచేసిన సున్నిపిండి, హెయిర్ ఆయిల్, షాంపూ, హెన్నాను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం పవిత్రను ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, పలువురు మహిళలు హెర్బల్ ఉత్పత్తులను కొనుగోలు చేశారని పవిత్ర తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే పూలు, చెట్లు, ఆకులు, వేర్లతో తయారు చేసే ఈ హెర్బల్ ఉత్పత్తులు వాడటం వలన ఎలాంటి హాని ఉండదన్నారు. ఈ నాలుగు ఉత్పత్తులతో నెలకు పదివేల వరకు ఆదాయం వస్తోందని పవిత్ర పేర్కొన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో గణతంత్ర, స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా డీఆర్‌డీఏ, ఐకేపీ



పవిత్ర తయారుచేసిన ఉత్పత్తులను ప్రారంభిస్తున్న కలెక్టర్ దేవసేన, ఇతర అధికారులు(ఫైల్)

ఆధ్వర్యంలో తాను తయారుచేసిన ఉత్పత్తుల స్టాల్‌ను నాలుగేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ, ఐకేపీ సహకారంతో హైదరాబాద్‌లోని శిల్పారామంలో కూడా స్టాల్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు పవిత్ర తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ దొంగిలించి అందులో ఉన్న సుమారు 5 వేల రూపాయలు ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం నాయకులు బండారి తిరుపతిగౌడ్, శ్రీరాముల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆలయంలో ఉన్న ఆరు తులాల వెండి, కొంతమేర బంగారం చోరీకి గురైందని పెద్దపల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు వారు తెలిపారు.

● ఓదెలలో..

ఓదెల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాపెల్లి రాజయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న రూ.20 వేలు నగదు, దాదాపు నాలుగు తులాల బంగారం చోరీకి పాల్పడినట్లు తెలిపారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రాజయ్య పేర్కొన్నారు.

గుప్త నిధుల పేరిట మోసం

● మహిళ వద్ద రెండేళ్లలో రూ.45లక్షలు వసూలు

మల్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం అత్యాశకు వెళ్లిన ఓ మహిళ మోసానికి గురై లక్షలాది రూపాయలు పోగొట్టుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొండగట్టుకు చెందిన ఓ మహిళ వద్దకు ఓ సూర్యాపేట జిల్లాకు చెందిన లింగానాయక్ వాసిగా పరిచయం చేసుకున్నాడు. సదరు వ్యక్తి ఇక్కడి చుట్టుపక్కల ప్రాంతంలో గుప్తనిధులు ఉన్నాయని మహిళను నమ్మించాడు. వాటిని పొందాలంటే పూజలు చేయించుకుంటే బంగారు బిళ్లలు తీసి ఇస్తానని చెప్పి రెండేళ్ల కాలంలో పలుమార్లు 45 లక్షల రూపాయల మేర వసూలు చేశాడు. ఇందులో భాగంగా కొండగట్టు సమీపంలోని ఓ చోట గుంత తవ్వి అందులో నుంచి కుండ తీసి దూరం నుంచి బంగారు బిళ్లలు చూపించాడు. వాటికి పూజలు చేసిన తరువాత ఇస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి మోసపోయినట్లు గుర్తించిన మహిళ 15 రోజుల క్రితం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడు లింగానాయక్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ వివరించారు.

పార్ట్‌టైమ్ జాబ్‌లు, ట్రేడింగ్ పేరుతో మోసం

- మంచిర్యాలలో గృహిణి నుంచి రూ.31.6లక్షలు కాజేసిన సైబర్ నేరస్థులు - కమీషన్లకు అకౌంట్లు అద్దెకు ఇచ్చిన వ్యక్తి అరెస్ట్

కోల్‌సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మంచిర్యాలకు చెందిన ఒక గృహిణిని సైబర్‌నేరగాళ్లు మోసగించి రూ.31.6లక్షలు కాజేశారు. ఈ ఏడాది అక్టోబరు 11న బాధితురాలు రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు నిందితుడు మహ్మద్ ఆవాజ్(21)ను శనివారం అరెస్టు చేశారు. మంచిర్యాలకు చెందిన ఒక గృహిణిని ఆన్‌లైన్ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ జాబ్‌ల పేర సైబర్ నేరస్థులు నమ్మించారు. ట్రేడింగ్‌లో లక్షలు వస్తాయని చెప్పడంతో సైబర్ నేరస్థులు చెప్పిన అకౌంట్‌లో డబ్బులు వేసుకుంటూ వెళ్లింది. అలా రూ.31,60,900 అకౌంట్‌లో వేసింది. తరువాత మోసపోయినట్లు గుర్తించి అక్టోబరు 21న రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, డీఎస్పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సిబ్బంది కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. డబ్బులు డ్రా అయిన అకౌంట్ ఆధారంగా విచారణ జరుపగా హైదరాబాద్ మలక్‌పేటలో నిందితుడు మహ్మద్ ఆవాజ్(21)ని పట్టుకున్నారు. అతడు ఏసీ టెక్నీషియన్‌గా, ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తాను కేవలం అకౌంట్లు తన పేర తెరిచి ఇలియాజ్ అనే వ్యక్తికి ఇస్తానని, వారు సైబర్ నేరానికి పాల్పడి తన అకౌంట్‌లో డబ్బులు వేస్తారని, అలా తన అకౌంట్‌లో డబ్బులు పడినందుకు రూ.300 కమీషన్ ఇస్తారని తెలిపారు. తాను అలా మూడు అకౌంట్లు ఓపెన్ చేసి సైబర్ నేరస్థులకు ఇచ్చినట్లు విచారణలో తెలిపాడని, అతడిని అరెస్టుచేసినట్లు డీఎస్పీ తెలిపారు.



సైబర్ మోసం.. రూ. 9.80లక్షలు మాయం

గంగాధర(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసంతో 9.80 లక్షల రూపాయలు పోగొట్టుకున్న ఘటన గంగాధరలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం మధురానగర్ యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. బ్యాంకు ఖాతాలో 9.83లక్షలు ఉండగా ఏటీఎంతో అవసరమున్నప్పుడు డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. ఏటీఎం కార్డు పోవడంతో కొత్తది తీసుకునేందుకు ఈ నెల 5న అతను బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ సిబ్బంది బ్యాంకు టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయమని తెలిపారు. అయితే బాధితుడు టోల్ ఫ్రీ నంబర్ తప్పుగా కొట్టడంతో ఎదుటి వ్యక్తి హిందీలో మాట్లాడి మరుసటి రోజున ఓటీపీ వస్తుందని తెలిపారు. తిరిగి 6న అదే నంబర్ నుంచి ఫోన్ కాల్ చేసి ఓటీపీ తెలుపమని చెప్పగానే బాధితుడు తెలిపారు. ఇలా మూడుసార్లు ఓటీపీ పంపి నంబర్ తెలుపమని అనగానే బాధితుడు చెప్పగా ఖాతా నుంచి విడతల వారీగా రూ. 9.80 లక్షలు కొల్లగొట్టారు. ఈ నెల 10న బ్యాంకు ఖాతా బుక్కుతో డబ్బులు తీసుకుందామని వెళ్లి పరిశీలించగా ఖాతాలో డబ్బులు లేవని బ్యాంకు సిబ్బంది తెలిపారు. లక్షల రూపాయలున్న ఖాతాలో డబ్బులు ఎలా మాయమయ్యాయని బాధితుడు ఆందోళన చెందాడు. సిబ్బంది పరిశీలించి ట్రాన్స్‌ఫర్ అయిన ఖాతా కనిపించకపోవడంతో బాధితుడిని సెల్ ను పరిశీలించారు. సెల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పానని తెలపడంతో సైబర్ మోసం జరిగినట్లు తెలిసింది. దీనిపై కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా జగిత్యాల సైబర్‌క్రైంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. డబ్బులు మాయమై నాలుగు రోజులు గడిచినందున రికవరీ కష్టమని పోలీసులు తెలుపుతున్నారు. దీనిపై సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా బాధితుడు ఏటీఎం పోయినందుకు టోల్‌ఫ్రీకి కాల్‌చేయమనగా ఒక నంబర్ తప్పుగా కొట్టడని, అది సైబర్ నేరగాళ్లకు వెళ్లి ఓటీపీ చెప్పగానే సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు తెలిపారు. డ్రా చేసే దొరుకుతా మని సైబర్ నేరగాళ్లు వస్తువులను కొన్నట్లు తెలుస్తోందని తెలిపారు. బ్యాంకు పేరున ఓటీపీ చెప్పమని ఎవరూ ఫోన్‌చేయరు, ఎవరైనా ఓటీపీ చెప్పమని ఫోన్‌చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని బ్యాంకు మేనేజర్ సూచించారు.

అదుపు తప్పిన గ్రానైట్ లారీ

- ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ
- నిలిచిన విద్యుత్ సరఫరా



కిందపడిన గ్రానైట్ రాయి, తెగిన తీగలు

కొడిమ్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామ డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో వేములవాడ-జగిత్యాల ప్రధాన రహదారిపై శనివారం మధ్యాహ్నం గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. నల్లగొండ వైపు నుంచి గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ ఇంజన్ ట్రాలీ లింక్ ఊడిపోయి అదుపు తప్పింది. దీంతో ఇంజన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని కొడిమ్యాల తహసీల్దార్ రమేశ్, ట్రాన్స్‌కో ఏడీఈ ఆర్ మహేందర్, కొడిమ్యాల ఎంపీడీవో రమణారెడ్డి, ఏఈ శివకుమార్, పోలీసులు పరిశీలించారు. 100కేవీ, 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు విద్యుత్ పోళ్లు దెబ్బతిన్నాయన్నారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివాహేతర సంబంధమే కారణం - వివరాలు వెల్లడించిన వేములవాడ ఏఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న ఆగ్రహంతోనే నూనె మనోహర్ అనే వ్యక్తి రఫీక్ అనే యువకుడిని హతమార్చినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీన వేములవాడ పట్టణంలో రఫీక్ అనే యువకుడిని వేటాడి వెంటాడి కత్తితో పొడిచి దారుణంగా హతమార్చిన ఘటనకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి శనివారం రాత్రి వేములవాడ రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వేములవాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో నివాసం ఉండే నూనె మనోహర్ అనే వ్యక్తి జీవనోపాధి కోసం కొంతకాలంగా దుబాయ్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనోహర్ భార్యతో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మహమ్మద్ రఫీక్(35) అనే యువకుడు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం మనోహర్‌కు తెలిసింది. వివాహేతర సంబంధం విషయంలో గతంలో భార్యను మందలించగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. భార్య మళ్లీ ఇంట్లో నివాసం ఉంటూ వివాహేతర సంబంధాన్ని యథావిధిగా కొనసాగిస్తుండడంతో మనోహర్ తీవ్రఆగ్రహానికి లోనయ్యాడు. ఈ క్రమంలో మనోహర్ 45 రోజుల క్రితం దుబాయ్ నుంచి వేములవాడకు వచ్చాడు. భార్య వ్యవహార శైలితో ఎలాగైనా రఫీక్ అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఈనెల 18వ తేదీన తెల్లవారుజామున ఆర్యన్ కాలనీ ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన రఫీక్‌పై కత్తితో పొడిచి చంపాడు. హత్యానంతరం పరారీలో ఉన్న నిందితుడు మనోహర్‌ను శనివారం మధ్యాహ్నం మల్లారం రోడ్డు ప్రాంతంలో అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు నిందితుడి పాస్‌పోర్ట్, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమేశ్ మారుతి, పట్టణ ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనం వేస్తే అవార్డుల పంటే

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయన విత్తనం వేస్తూ.. అవార్డుల పంట పండిస్తున్నాడు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ.. వేసిన రకాలు వేయకుండా నూతనంగా వచ్చే వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా వరి పంటను పండిస్తూ.. రాష్ట్రంలోని పలువురు రైతులకు మెళకువలను నేర్పించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాడు పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలంలోని కాసులపల్లి గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి. అధిక దిగుబడి వచ్చే వరి విత్తనాలను తయారు చేసి జిల్లాతో పాటు పలు రాష్ట్రాల రైతులకు ఎగుమతి చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డు అందుకున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

● డ్రమ్ సీడర్ పద్ధతితో సాగు చేస్తూ..

ఎర్రం మల్లారెడ్డి 2012 నుంచి తనకున్న 12 ఎకరాల్లో డ్రమ్ సీడర్ పద్ధతితో వరిపంటను సాగు చేస్తున్నాడు. తనకున్న భూమిలో ఇప్పటివరకు వేసిన రకాలు వేయకుండా నూతనంగా వచ్చే వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తూ అధిక నష్టాల నుంచి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. అలాగే పలు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన రైతులకు కూడా డ్రమ్ సీడర్ ద్వారా పంట దిగుబడి వరి పంటలోని మెళకువలతో సలహాలిస్తూ రైతులకు అవగాహన

- డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగు
- పలు జిల్లాల రైతులకు సూచనలు ఇస్తున్న మల్లారెడ్డి
- ఉత్తమ రైతుగా అవార్డులు, సత్కారాలు

కల్పిస్తున్నాడు. ఇప్పటివరకు వేసిన పంటల రకాల్లో అధిక దిగుబడి వచ్చే వరి విత్తనాలను తయారు చేసి ప్యాకింగ్‌తో జిల్లాతో పాటు పలు రాష్ట్రాల రైతులకు ఎగుమతి చేస్తున్నాడు. కొంతమంది రైతులు ఒకే పద్ధతి అంటూ ఆశ్చర్యానికి గురైనా మల్లారెడ్డి మాత్రం డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరిపంటను సాగు చేసి ఔరా అనిపించారు. మల్లారెడ్డిని చూసిన రైతులు కొందరు కూలీల కొరతను నివారించేందుకు డ్రమ్ సీడర్ పద్ధతిని అవలంబిస్తూ వరిపంటను సాగు చేస్తున్నారు.

● ఇతర రాష్ట్రాలకు నూతన వంగడాలు

మల్లారెడ్డి తాను డ్రమ్ సీడర్ ద్వారా నూతన వంగడాలను సాగు చేస్తూ అందులో బీడీపీటలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసి వాటిని రైతులకు అందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాల రైతులకు నూతన వంగడాలను అందిస్తూ రైతులకు అధిక దిగుబడి పొందేందుకు ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు పరిశోధన కేంద్రాల నుంచి వివిధ రకాలైన వరి విత్తనాలు తీసుకొచ్చి సాగుచేసి




డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు మల్లారెడ్డి

అభివృద్ధి చేస్తున్నారు. వరి వంగడాలతో పాటు కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించి అధిక దిగుబడిపై శ్రద్ధ వహించి పలువురికి సూచిస్తున్నారు.

● అన్నదాతలకు అండగా..


పెద్దపల్లి జిల్లా ఫార్మర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా మల్లారెడ్డి బాధ్యతలు తీసుకొన్ని అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. ఆర్గనైజేషన్‌లో సుమారు 300 మంది రైతులను భాగస్వాములను చేసి, అధిక దిగుబడి వచ్చే కూరగాయల విత్తనాలు, వరి వంగడాలను రాయితీపై అన్నదాతలకు అందజేస్తున్నారు. వీటితో పాటు పంటలకు అందించే ఎరువులను అందించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.



మల్లారెడ్డి ఇంట్లో అవార్డులు

రైతులు ఆనందంగా ఉండేందుకే

- ఎర్రం మల్లారెడ్డి, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, కాసులపల్లి



రైతులు సాగు చేస్తున్న పంటలపై అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలోని పరిశోధన కేంద్రాల నుంచి ప్రతి ఏటా 10 రకాల వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసి నష్టం వాటిల్లని విత్తనాన్ని ఎంపిక చేస్తున్నాను. వీటిని సాగు చేయడం ద్వారా పెట్టుబడి వ్యయం తక్కువవడంతో పాటు పెట్టుబడి కూడా తగ్గుతున్నాయి. రైతులు నష్టపోకుండా లాభాల బాటలో నడుస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో మరింత ఉత్సాహం అనిపిస్తోంది.



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ఎర్రం మల్లారెడ్డి (ఫైల్)

● అవార్డులు.. సత్కారాలు

డ్రమ్ సీడర్ ద్వారా మల్లారెడ్డి నూతన వరి వంగడాలను సాగు చేస్తుండటంతో పంట పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నూతన వంగడాలను పండించడంతో పాటు సరికొత్త పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు వచ్చే వంగడాలను రైతులకు అందిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పలు అవార్డులు, సత్కారాలు అందించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఒక్కరికి ఉత్తమ రైతు అవార్డు అందించగా పెద్దపల్లి జిల్లా కాసులపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మల్లారెడ్డికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



జగిత్యాల లో సన్మానం అందుకుంటున్న మల్లారెడ్డి దంపతులు

'శాతవాహన' సమాచారం

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం పది మంది విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో సెమిస్టర్‌లో అపూర్వ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాణినికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో నలుగురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు, మూడో సెమిస్టర్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

పీజీ, ఎంసీఏ, ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న పీజీ, ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్ వి శ్రీరంగ ప్రసాద్ శనివారం విడుదల చేశారు. ఈ పరీక్షలు జనవరి రెండో తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని వివరించారు.

టీజీవో సంఘం ప్రచార కార్యదర్శిగా సంతోష్



సంతోష్‌ను అభినందిస్తున్న నాయకులు

జగిత్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవో) సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జగిత్యాల జిల్లాకు చెందిన గంగుల సంతోష్ ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గంలో ప్రచార కార్యదర్శిగా గంగుల సంతోష్ కుమార్‌ను నియమిస్తూ టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సంతోష్‌కుమార్ నియమితులైన సందర్భంగా టీజీఓ జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవి బాబు, కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు కాళీచరణ్, రవీందర్, దేవానంద్ హర్షం వ్యక్తం చేశారు.

మెడికల్ ఆఫీసర్ నియామకానికి నోటిఫికేషన్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంబీబీఎస్ విద్యార్హతతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఫీల్డ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత నివ్వనున్నట్టు సూపరింటెండెంట్ దయాల్ సింగ్ పేర్కొన్నారు. 70 సంవత్సరాలలోపు వయసు ఉండాలన్నారు. నెలకు రూ.72వేల వేతనం ఉంటుందని, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎడారి దారిలో.. వేములకుర్తి

ఐదు దశాబ్దాల క్రితం ఆ గ్రామం గల్ఫ్ బాట పట్టింది. తండ్రి మొదలుకొని ఇప్పుడున్న కొడుకులు, యువత అదే బాటలో పయనించి ఆర్థికంగా ఎదిగారు. గల్ఫ్ వలసలకు కేరాఫ్‌గా వేములకుర్తి నిలుస్తోంది. గ్రామంలో ఐదు వేలు పై చిలుకు జనాభా ఉండగా దాదాపుగా 800 మంది గల్ఫ్‌లోనే స్థిరపడ్డారు. విదేశీ వలసల వల్ల గ్రామానికి యేటా సుమారు రూ. 15 కోట్ల విదేశీ మారకద్రవ్యం వస్తోంది. వలసల కారణంగా గ్రామంలో అధికంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులే కని పిస్తుంటారు. స్వయం ఉపాధి పొందుతున్న యువకులు, ఉద్యోగస్థులు, వ్యవసాయం జోరుగా చేస్తున్న వ్యక్తులు మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. మిగిలిన వారంతా దాదాపుగా విదేశాల్లోనే ఉపాధి చూసుకుని అక్కడే ఉంటున్నారు.



- ఐదు దశాబ్దాలుగా గల్ఫ్ బాటలో
- విదేశాల్లో కంపెనీలు స్థాపించి అక్కడే స్థిర జీవనం
- గ్రామానికి యేటా సుమారు రూ. 15కోట్ల విదేశీ మారకద్రవ్యం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల-నిర్మల్ జిల్లాల మధ్య గల గోదావరి తీర ప్రాంతమైన ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామం విదేశీ వలసలకు నిలయంగా మారింది. సుమారు ఐదు దశాబ్దాలుగా గ్రామానికి చెందిన యువత విదేశాలకు వెళ్లి వస్తున్నారు. ఉన్న ఊర్లో ఉపాధి అంతంతమాత్రంగానే ఉండడంతో యువత ఎడారి బాట పడుతున్నారు. గ్రామంలో దాదాపుగా ఇంటికి ఒకరు చొప్పున గల్ఫ్ దేశాల్లో ఉపాధి చూసుకుని అక్కడే ఉంటున్నారు. గల్ఫ్ దేశాలతో వేములకుర్తి వాసులకు ఎక్కువగా రాకపోకల సంబంధాలు ఉంటున్నాయి. ప్రధానంగా మస్కట్, అబుదాబి, బెహరన్, ఓమన్, దుబాయి, ఖతార్ తదితర దేశాలకు వలస వెళ్లి వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు.

● సొంత కంపెనీల ఏర్పాటు....

వేములకుర్తి నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన పలువురు గ్రామస్థులు అక్కడ సొంత కంపెనీలు ఏర్పాటు చేసుకొని ఇతరులకు సైతం పనికల్పించే స్థితికి ఎదిగారు. కొందరు సొంత వ్యాపారాలు నిర్వహిస్తుండగా, మరికొందరు పలు సాఫ్ట్‌వేర్, కన్ స్ట్రక్షన్ కంపెనీలను నెలకొల్పి ఇతరులకు ఉపాధి చూపుతున్నారు. వేములకుర్తికి చెందిన సుమారు పది కుటుంబాలు గల్ఫ్‌లో కంపెనీలు నెలకొల్పి స్థిరపడ్డాయి. పలువురు యు వకులు వివిధ కంపెనీల్లో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ట్రావెలింగ్ ఏజంట్, లేబర్, స్టీల్ ఫిట్టర్, ట్రేడర్స్, స్టోర్ కీపర్‌గా, పెట్రోలు బాయ్‌గా, మున్సిపల్ వర్కర్‌గా, సినిమాహాళ్లు, హోట ళ్లలో పనిచేస్తున్నారు. వేములకుర్తికి చెందిన ప్రవాస భారతీయుల సహకారాలతో గ్రా మంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి.

● గల్ఫ్‌లో 800 మంది....

వేములకుర్తి గ్రామం నుంచి ప్రస్తుతం సుమారు 800 మంది వరకు గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. కొందరు ప్రొఫెషనల్ పనులు చేస్తుండగా, మరికొందరు కార్మికులుగా ప నిచేస్తున్నారు. అర్హత, అనుభవం, అవకాశాలను బట్టి గల్ఫ్ దేశాల్లో వివిధ రంగాల్లో వేములకుర్తి వాసులు ఉన్నారు. అక్కడ సంపాదించిన సొమ్మును ఖర్చులు పోను పలు సందర్భాల్లో సొంత గ్రామంలోని తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు పంపుతుం టుంటారు. ఒక్కొక్కరు నెలకు భారత కరెన్సీ విలువ ప్రకారం సుమారు రూ. 25 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు సంపాదిస్తున్నారు. దీంతో నెలకు సగటున సుమారు రూ. కోటిన్నర వరకు కోట్ల విదేశీ మారకద్రవ్యం వస్తోంది. యేటా సుమారు రూ. 15 కోట్ల వ రకు ఉంటుందన్న అంచనాలున్నాయి. గ్రామంలో అధిక లావాదేవిలు జరుగడంతో విరి సౌకర్యార్థం ఓ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను గ్రామంలో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.


వేములకుర్తి గ్రామ స్వాగత తోరణం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు జలాభిషేకం చేస్తున్న గల్ఫ్ మిత్రులు

వ్యవసాయంపై ఆధారపడి జీవించేవాళ్లం

-అల్లకొండ గంగాధర్, వేములకుర్తి



నేను 1986 సంవత్సరంలో దుబాయి వెళ్లాను. అప్పుడు మా గ్రామం నుంచి కొత్తగా దుబాయి వెళ్లాం. దుబాయి వెళ్లి బిల్డింగ్ పనులు చేసి ఉపాధి పొందాము. నెలకు అక్కడ ఇండియా కరెన్సీ ప్రకారం 14 వేల జీతం తీసుకునేవాడిని. అక్కడ కొన్ని ఖర్చులకు ఉంచుకుని మిగిలిన డబ్బులను ఇంటికి పంపేవాళ్లం. నేను అంతకు ముందు ఊళ్లో వ్యవసాయం, గీత కార్మికుడికి కల్లు అమ్ముకుంటూ ఉపాధి పొందేవాడిని. సొంత ఊళ్లో పని చేసినప్పుడు పొట్ట, బట్ట మందం మాత్రమే సంపాదించేవాడిని. గల్ఫ్ వెళ్లిన తర్వాతనే ఆర్థికంగా ఎదిగాను. 1986 కంటే ముందు గ్రామంలో అందరు వ్యవసాయం, వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు కాలం గడిపేవాళ్లం. కానీ గ్రామం నుంచి ఒక్కొక్కరుగా గల్ఫ్ బాట పట్టడంతో గ్రామస్థులందరూ ఆర్థికంగా ఎదిగారు. అప్పుడు చిన్న చిన్న పెంకుటిళ్లు ఉండేవి. ఇప్పుడు ప్రతీ ఒక్కరు పెద్ద పెద్ద భవంతులు సొతూళ్లలో నిర్మించుకున్నారు. విలాసవంతమైన జీవితనం గడుపుతున్నారు. గ్రామంలో ఒక్కప్పుడు బిజినెస్‌లు అనేవి లేకుండే. ఇప్పుడు పదుల సంఖ్యలో కోళ్ల ఫాంలు ఏర్పాటు చేసుకున్నారు. ఆర్థిక లావాదేవీలు జరగడంతో బ్యాంక్‌లు ఏర్పడ్డాయి. పెద్ద పెద్ద వావానాలు కొనుగోలు చేసి వేరే రాష్ట్రాలలో బిజినెస్‌లు చేస్తున్నారు.

ఉపాధి నిమిత్తం ఎడారి బాట పట్టాం

- ఆడ్వల రాము, వేములకుర్తి



ఉన్న ఊర్లో ఆశించిన ఉపాధి దొరకక పోవడం వల్ల ఏడారి బాట పట్టాం. సింగపూర్ దేశంలో ఓ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌గా పని చేశాను. 1.5 లక్షల రూపాయలు జీతం తీసుకున్నాను. ప్రస్తుతం గ్రామం తిరిగి వచ్చి సొంతంగా కోళ్ల ఫారం పెట్టుకున్నాను.

పాతికేళ్లుగా గల్ఫ్‌లో ట్రావెలింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్నా..

- చింత రాజమల్లు, వేములకుర్తి



సుమారు గత పాతికేళ్లుగా వేములకుర్తిలో ట్రావెలింగ్ ఏజెన్సీతో పాటు ఓ చిన్న కంపెనీ నెలకొల్పాను. అప్పుడప్పుడు వేములకుర్తికి వచ్చి వెళ్తుంటాను. గ్రామం నుంచి గల్ఫ్ దేశాల్లో అధిక సంఖ్యలో యువత పనిచేస్తున్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడం కారణంగా వలసలు జరుగుతున్నాయి.

యోగాతో మానసిక వికాసం

- యోగా అసోసియేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక వికాసం కలుగుతుందని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి యోగా, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలను, పతకాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగాలో శిక్షణ పొందితే సంపూర్ణ ఆరోగ్యవం తులవుతారన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ యోగా క్రీడాకారులు తిరుగులేని పతకాలను సాధిస్తూ జాతీయ స్థాయిలో విజయాలను పొందుతున్నారన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో సీఎంకప్ జిల్లాస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఉదయం యోగా, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను డీవైఎస్‌వో అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబు శ్రీనివాస్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు అంతడ్పుల శ్రీనివాస్, సొల్లు సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అంతటి శంకరయ్య, పోతన శ్రీనివాస్, వంగపల్లి సూర్యప్రకాశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు పతకాలను అందజేస్తున్న రవీందర్‌సింగ్


యోగాసనాలు వేస్తున్న బాలికలు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కోనరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పూజిత రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైనట్లు ఎంఈవో మురళి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పూజిత ఈనెల 22 నుంచి 25 వరకు మేడ్చల్ మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైందని వివరించారు. కాగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థిని శనివారం అభినందించారు.

రాజన్నను దర్శించుకున్న డైరెక్టర్ వంశీ పైడిపల్లి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ డైరెక్టర్ వంశీ పైడిపల్లి శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి చేరుకున్న వంశీ పైడిపల్లికి బీఆర్‌ఎస్ సీనియర్ నేత, వేములవాడ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి స్వాగ తం పలికారు. రాజన్న ఆలయంలోకి చేరుకున్న వంశీ కోడెమొక్కు చెల్లించుకు ని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం రాజన్న ఆలయ అర్చకులు ఆశీర్వదించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఏనుగు తిరుపతిరెడ్డి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.


డైరెక్టర్ వంశీకి రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

అంజన్న సన్నిధిలో..

మల్యాల: సినిమా దర్శకుడు వంశీ పైడిపల్లి శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డితో పాటు కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, రాజు ఉన్నారు.

మహిళలకు 'భరోసా'

- బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం
- కొత్తపల్లిలో నేడు కేంద్రాన్ని ప్రారంభించనున్న డీజీపీ
- రూ.1.70 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మాణం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం చూపుతూ, వారికి భద్రత కల్పించేందుకు కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో పోలీసుశాఖ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కమిషనరేట్‌లోని పోలీసు ఠాణాల్లో నమోదైన మహిళలు, బాలికలకు సంబంధించిన కేసుల్లో బాధితుల వాంగ్మూలం రికార్డు చేయటం, కోర్టులో హాజరుపరచటం, మెజిస్ట్రేట్‌తో వాంగ్మూలనం రికార్డు చేయించటం, కౌన్సెలింగ్ వంటివి ఈ భరోసా కేంద్రంలో జరుగనున్నాయి. ఆదివారం డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) జితేంద్ర కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. కమిషనరేట్ కేంద్రంలో నిర్మించిన ఫంక్షన్‌హాల్, కేఫ్‌లను ఆయన ప్రారంభోత్సవం చేయనున్నారు. 2022 డిసెంబరు 17న ఈ భరోసా కేంద్రానికి శంకుస్థాపన జరగగా కోటి 70 లక్షల రూపాయల నిధులతో 13 గుంటల స్థలంలో అత్యంత ఆధునిక వసతులతో ఈ భవనం నిర్మాణం పూర్తి చేశారు. ఈకేంద్రంలో చైల్డ్ అండ్ ఉమెన్ ప్రొటెక్షన్, అత్యాచారం, పోక్సో కేసుల విచారణ జరుపుతారు. గృహహింస, పోక్సో, సైబర్ వేధింపుల్లో మహిళా బాధితులకు సరైన న్యాయ సహాయం అందించాలనే ధ్యేయంతో ఈ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురైన, ఆపదలో ఉన్న మహిళలకు వైద్య చికిత్సలు, కౌన్సెలింగ్, భద్రత, న్యాయసహాయాన్ని అందించేందుకు ప్రత్యేకంగా జిల్లాకు ఒకటి భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పనిచేసేందుకు కాంటాక్ట్ ఉద్యోగుల నియామకానికి దరఖాస్తులు కోరుతూ పోలీస్ కమిషనర్ ఇటీవల నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నడిచే ఈ భరోసా కేంద్రానికి ఏసీపీ మాధవి ఇన్‌చార్జిగా ఉన్నారు. ప్రస్తుతం ఈ భరోసా కేంద్రంలో ఒక నిర్వహణాధికారి, ఇద్దరు కౌన్సెలర్లు, రిసెప్షనిస్టు, ఒక ఏఎన్‌ఎం, లీగల్ అడ్వైజర్ ఉంటారు. వీరంతా బాధితులకు కావాల్సిన అన్ని రకాల సమాచారంతో పాటు సహాయాన్ని అందిస్తారు.




కొత్తపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన భరోసా కేంద్రం

కమిషనరేట్‌లో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. ఏడాదిలో 500పైగా మహిళలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. ఇందులో అత్యాచారాలు, వేధింపులు, పోక్సో కేసులకు సంబంధించిన బాధితుల్లో మహిళలు, యువతులు, బాలికలు ఉన్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాల కట్టడి, కేసుల నమోదు, కౌన్సెలింగ్ ఇవ్వటం, బాధితులకు న్యాయ సహాయం అందించడం, ఎన్ఆర్ఐ భర్తల కేసుల్లో సహాయం అందించడం, మహిళలను వేధించే పోకిరీలకు చెక్‌పెట్టడం, సైబర్ నేరాలపై మహిళలకు భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తారు. మహిళా బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, లైంగిక, ఇతర రకమైన వేధింపులు, నేర ఘటనల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి తదితర విషయాల్లో ఈ భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పించనున్నారు.

కమిషనరేట్‌లో కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించనున్న డీజీపీ

కమిషనరేట్ కేంద్రంలో దశాబ్దాల కిందట నిర్మించిన జాన్‌విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ప్రస్తుతం పోలీస్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని కన్వెన్షన్ సెంటర్‌గా పునర్నిర్మాణం చేయించారు. దీన్ని డీజీపీ ప్రారంభించనున్నారు. దీనిలో పోలీసు కుటుంబాలలో పెళ్లిళ్లకు కొంత రాయితీ ఇస్తూ ఇతరులకు కూడా ఇందులో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. చాకలి ఐలమ్మ జంక్షన్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో రోడ్డువైపున ఒక కేఫ్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండు కూడా డీజీపీ ప్రారంభించనున్నారు.

'కేథడ్రల్‌రాక్' పై 108 సూర్య నమస్కారాలు



పర్వతంపై సూర్య నమస్కారాలు చేస్తున్న ప్రవీణ్


మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన మరిపెల్లి ప్రవీణ్ అమెరికాలోని అరిజోనా రాష్ట్రం సెడోనా సమీపంలోని కేథద్రల్ రాక్ పర్వతాన్ని అధిరోహించాడు. ప్రవీణ్ ఈనెల 20న సముద్ర మట్టానికి 4900 అడుగుల ఎత్తులోని రాతి పర్వతాన్ని అధిరోహించి 22 నిమిషాలలో 108 సూర్య నమస్కారాలు చేసినట్లు ఆయన తెలిపాడు. ప్రవీణ్ ఇప్పటికి అతి తక్కువ ఉష్ణోగ్రతలలోని ఎత్తయిన 49 పర్వతాలు అధిరోహించాడు. వాటిపై 108 సూర్య నమస్కారాలు చేస్తూ యోగా శక్తిని ప్రపంచానికి చాటిచెబుతున్నాడు.

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

- విజేతలుగా రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా జట్లు

సిరిసిల్ల టౌన్/కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాజన్న సిరిసిల్ల పురుషుల జట్టు, కరీంనగర్ మహిళ జట్టు విజయం సాధించాయి. శనివారం జిల్లా యువజన, కీడాశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం మినీస్టేడియంలో సీఎం కప్-2024 ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల, కరీనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా పురుషుల నాలుగు జట్లు, మహిళ నాలుగు జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ స్థానంలో, జగిత్యాల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు ట్రోఫీలతో పాటు వ్యక్తిగతంగా స్వర్ణం, సిల్వర్ మెడల్స్‌ను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి అందించి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జగిత్యాల వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు సుధీర్‌రావు, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గుడ్ల రవి, కోశాధికారి కోడం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, వాలీబాల్ అకాడమి కోచ్‌లు సంపత్, జగన్, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ జట్ల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.




విజయం సాధించిన కరీంనగర్ జిల్లా మహిళల జట్టుతో అతిథులు, తలపడుతున్న వాలీబాల్ జట్లు

ఇదేనా 'సంక్షేమం'

(5వ పేజీ తరువాయి)

అక్కడ సైతం ఎలాంటి ఇబ్బందులు లేవు.

● వాచ్‌మన్ లేక ఇబ్బందులు

గన్నేరువరం: మండల కేంద్రంలో ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కు వాచ్‌మెన్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మానకొండూరుకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలను మండలంలోని గుండ్లపల్లి స్టేజి రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. హాస్టల్‌లో బెడ్లు లేక విద్యార్థులు కిందనే పడుకుంటున్నారు.

● నేలపైనే నిద్ర

గంగాధర: మండలంలోని ఎస్సీ బాలుర, కస్తూర్బా గాంధీ బాలికల, జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. వసతి గృహాల్లో కిటికీలకు తలుపులు లేక, సరిపడా రగ్గులు లేక చలికి విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో బాత్‌రూంలు ఉన్నప్పటికీ తలుపులు విరిగిపోయాయి. జ్యోతిబాపూలే బాలికలు, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో రక్షిత మంచినీటి యంత్రాలు చెడిపోయాయి. దీంతో విద్యార్థులు బోరు నీరే తాగుతున్నారు. నాలుగు నెలలుగా విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలు అందక ఇంటి నుంచే డబ్బులు తెప్పించుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు.

● శ్మశానం పక్కన హాస్టల్

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలోని ఎస్సీ హాస్టల్ శ్మశానం పక్కనే ఉంది. శ్మశానంలో శవాలను దహనం చేస్తున్న వేళ వస్తున్న దుర్వాసన హాస్టల్‌లోకి వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. బాత్రూములు, మరుగుదొడ్లు



వీణవంక ఎస్సీ హాస్టల్‌లో తలుపులు ఊడిపోయిన మరుగుదొడ్లు

పూర్తి స్థాయిలో లేవు.

● చెడిపోయిన బోరు..

మానకొండూర్: మానకొండూర్‌లోని సమీకృత హాస్టల్‌లో 18 మరుగుదొడ్లు ఉండగా ఐదు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. 18 స్నానపు గదులకు ఆరు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మిగతావాటి తలుపులు పగిలిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. రెండు బోర్లకు గాను ఒక్కటి చెడిపోయింది. దీంతో విద్యార్థుల స్నానాలకు, వంటలు చేయడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు, స్విచ్‌బోర్డు చెడిపోయినా మరమ్మతులు చేయడం లేదు. బ్లాంకెట్స్ పంపిణీ చేయకపోవడంతో చలికి ఇబ్బందులు పడుతున్నారు. మెష్ డోర్లు ఏర్పాటు చేయకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వంట చేసే వారు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు.

● తలుపులు లేని మరుగుదొడ్లు

తిమ్మాపూర్: మండలంలో మహాత్మాజ్యోతిబా



నగునూర్ బీసీ హాస్టల్‌లో నేలపైనే పడుకున్న విద్యార్థి

పూలే బిసి బాలికల పాఠశాల, సాంఘిక సంక్షేమ ప్రతిభ కేంద్రం(సీవోఈ), కస్తూర్బా గాంధీ, ఎస్సీ బాలికల వసతి గృహాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. మైనారిటీ పాఠశాల, రామకృష్ణ కాలనీలో గన్నేరువరం మండలానికి చెందిన మహాత్మాజ్యోతి భాపూలే బిసి బాలుర పాఠశాల ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు ఇప్పటికీ బెడ్స్ కానీ, దుప్పట్లు కానీ ఇవ్వలేదు. దీంతో వారు నేల మీదనే పడుకుంటున్నారు. రామకృష్ణ కాలనీలోని బీసీ గురుకుల బాలుర పాఠశాలలో టాయిలెట్స్ సరిగా లేవు. బాత్‌రూంల తలుపులు విరిగిపోయాయి. విద్యార్థులకు బెడ్‌షీట్స్ ఇవ్వలేదు. ఎల్ఎండీలోని బాలికల ఎస్సీ వసతి గృహంలో బాత్రూంలకు బోల్టులు ఊడిపోయాయి.దోమతెరలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

● ప్రైవేట్ భవనాల్లో హాస్టల్స్

హుజూరాబాద్: పట్టణంలో నాలుగు గురుకుల పాఠశాలలు ఉండగా, అందులో మూడు ప్రైవేట్ పాఠశాలల భవనాల్లో నడుస్తున్నాయి. హాస్టల్స్ వేడినీళ్లు లేకపోవడంతో చలిలో స్నానం చేయలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

● దుప్పట్లు లేక.. చలికి వణికి..

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని సంక్షేమ హస్టల్లో ఉంటున్న విద్యార్థులు సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. చింతకుంటలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 557 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌కు పక్కా భవనం లేదు. దుప్పట్లు ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. విద్యార్థులకు వేడి నీరు అందించకపోవడంతో చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. రేకుర్తి మైనార్టీ గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. విద్యార్థులకు 2019 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు దుప్పట్లు అందించలేదు. విద్యార్థుల కోసం మంజూరైన బెడ్ షీట్స్ టవల్స్ మాత్రమే అందించారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్, కేజీబీవీ హాస్టల్, ఎస్సీ బాలుర హాస్టల్‌తో పాటు బాలికల హాస్టల్ ఉన్నాయి. బీసీ బాలికల హాస్టల్‌లో ఐదుగురు విద్యార్థులు ఉండడంతో వేరే హాస్టల్‌కు విద్యార్థులను షిఫ్ట్ చేసి హాస్టల్ మూసివేశారు. విద్యార్థులకు కప్పుకోవడానికి దుప్పట్లు ఇంత వరకు ఇవ్వలేదు.

● అమలుకు నోచుకోని కొత్త మెనూ

కరీంనగర్ రూరల్: మండలంలోని దుర్శేడ్ గ్రామంలో ఎస్సీ, నగునూర్‌లో బీసీ సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. నగునూర్ బీసీ సంక్షేమ హాస్టల్‌లో బెడ్లు లేకపోవడంతో నేలమీదనే నిద్రిస్తున్నారు. ఉదయం చన్నీళ్ల స్నానం చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. కిటికీలకు దోమతెరలను కూడా ఏర్పాటు చేయలేదు. కొత్త మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు.

విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఎంఈవో రవీందర్ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రకాలైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాతూరి రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టీజీవో రాష్ట్ర కార్యవర్గానికి సన్మానం

సుభాష్‌నగర్, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరించారు.

'సీఎం రిలీఫ్‌ఫండ్‌తో బాధితులకు భరోసా'



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సుడా కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్‌ఫండ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులను అందుకున్న వారిలో ఎం మల్లమ్మ, కోయడ దేవయ్య పోచయ్య, జాగిరి తిరుపతి, బక్క శాంతమ్మ తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కొట్టె ప్రభాకర్, ఆస్తపురం తిరుమల, మామిడి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కరచాలనం పుస్తకావిష్కరణ

గణేశ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు విభాగం ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత, కవి, రచయిత వారాల ఆనంద్ రచించిన కరచాలనం పుస్తకాన్ని కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఆర్జేడీ, విద్యావేత్త బి.రామచంద్రరావు మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజానికి దిశా నిర్దేశం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కల్వకుంట రామకృష్ణ, పుల్లూరి జగదీశ్వర్, డా.గంద్ర లక్ష్మణరావు, పూర్వ ప్రధాన ఆచార్యులు డా. కోట మురళి, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం రచయిత ఆనంద్ తన కరచాలనం పుస్తకాన్ని, వారి బంధువులు వెంకటరమణ, మెట్టు సుగంధర్ రావులకు అంకితం చేశారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డా. బూర్ల చంద్రశేఖర్, వారాల ఆనంద్ సతీమణి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బొమ్మకల్‌లో గ్రామ శాఖ సమావేశం కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని పోరాటాలు చేసిన ఘన చరిత్ర సీపీఐ పార్టీదేనని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సాయవేని రాయమల్లు, సతీష్, శంకరయ్య, నరసయ్య, బాలయ్య, సంపత్ పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు మహిళా కళాశాల విద్యార్థిని ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని కె శ్వేత 9వ తెలంగాణ బెటాలియన్ నుంచి ఎంపికైందని కళాశాల ఏఎన్‌వో ఆయేషా షేక్ తెలిపారు. ఆర్‌డీపీ పరేడ్‌కు ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి వరలక్ష్మి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి రజనీదేవి, కామర్స్ విభాగాధిపతి జేవీ రాజిరెడ్డి, 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ డేనియల్ లొట్టిమ్, రాజేశ్ జేశ్వాల్, సాగర్‌సింగ్ తదితరులు అభినందించారు.

అవీ.. ఇవీ..

●భగత్‌నగర్: కరీంనగర్ బస్‌స్టేషన్‌ను కరీంనగర్-1 డిపో రీజనల్ మేనేజర్ బి రాజు శనివారం తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ హిమ బిందు, ఎంఎఫ్ వీరస్వామి, డిపో మేనేజర్ విజయమాధురి, మేనేజర్ సురేష్, తదితరులు ఉన్నారు.

●కరీంనగర్ కల్చరల్: జిల్లాకు చెందిన విద్యార్థుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొత్త అనిల్‌కుమార్, దొమ్మాటి శంకరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 'మానవ సంబంధాలు-ఆత్మీయతలు-అనుబంధాలు-విలువలు' అనే అంశంపై విద్యార్థులు కవితలను 9059072833, 6303459252 నంబర్లకు ఈ నెల 31వ తేదీలోపు వాట్సప్ ద్వారా పంపించాలని సూచించారు.

●కరీంనగర్ అర్బన్: మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే అసెంబ్లీలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శలు చేశారని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం వాసు అన్నారు. ఆయన డీసీసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారని కళాశాల ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ తెలిపారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవాన్ని నగరంలోని వాణినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డిలు పర్యవేక్షించగా గణిత విషయ నిపుణులు, సెక్టోరియల్ అధికారి అశోక్ రెడ్డి, కమ్యూనిటీ మొబిలేషన్ అధికారి ఆంజనేయులు, కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు.

● భగత్‌నగర్ అద్వితీయ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సొగాని, ప్రిన్సిపాల్ మాధురి శ్వేత పాల్గొన్నారు.

●వావిలాలపల్లి సెయింట్‌పాల్స్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ఎం రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని పాల్గొన్నారు.

●కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

●కోరాజాన్సన్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

●కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ గణిత, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.





గెలుపొందిన విద్యార్థులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, గణిత నమూనాలను ప్రదర్శిస్తున్న వాణినికేతన్ విద్యార్థులు

●సెయింట్‌జార్జ్, ప్యారడైజ్ విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ఫాతిమారెడ్డి, అకాడమిక్ సీఈవో ఉమాకాంత్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: నగునూర్‌లోని ఎస్‌పీఆర్ స్కూల్‌లో మ్యాథమెటిక్స్ క్విజ్, కరాటే బెల్ట్ టెస్టు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ విజయ మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ యాకయ్య, డైరెక్టర్ పీఆర్ రాజేందర్, ప్రశాంత్, శ్యాంసుందర్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఉపేంద్ర, ప్రిన్సిపాల్ చుక్కారెడ్డి పాల్గొన్నారు.

●గంగాధర/హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/మానకొండూర్/వీణవంక/ రామడుగు/చిగురుమామిడి/చొప్పదండి: గణిత శాస్త్రం కొత్త ఆవిష్కరణలకు పుణాదిలాంటిదని డీఈవో జనార్థన్‌రావు అన్నారు. శనివారం గంగాధర మండలం గర్షకుర్తిలో గణితశాస్త్ర దినోత్సవం సందర్భంగా గణిశాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించి మాట్లాడారు.

హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లో జరిగిన గణిత ప్రతిభ పోటీల్లో గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న మేరి ఏంజెల్, మొదటి స్థానంలో, పద్మినిలు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం అనురాధ తెలిపారు. మానకొండూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, వీణవంక మండలంలోని ఘన్ముక్ల, చిగురు మామిడి మండలం ముల్కనూర్ ఆదర్శ పాఠశాల, చొప్పదండి మండలంలోని ఆర్నకొండ, రామడుగు మండంలోని వెలిచాల ప్రభుత్వ పాఠశాలల్లో గణిత ప్రతిభ పోటీలు నిర్వహించారు. రామడుగు బ్రిలియంట్ మాడల్ స్కూల్‌లో విద్యార్థులు మ్యాథ్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్,డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): నగరంతో పాటు రూరల్ ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్,వన్,టూ,రూరల్, ఏడిఈలు, పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏం లావణ్య, తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు.. టవర్ సర్కిల్ , గంజ్‌ప్రాంతం, డీఎఫ్‌ఓ, డాక్టర్ స్ట్రీట్, శ్రీనగర్, సివిల్ హాస్పిటల్ వెనుక వైపు, గాంధీరోడ్, గర్ల్స్‌జూనియర్ కాలేజ్ రోడ్, రాజీవ్ చౌక్, అహ్మద్‌పురా, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, భారత్ టాకీస్ ఏరియా, పాతబజార్, బోయివాడ, గంజ్, సిఖ్ వాడి, మార్కెట్ ఏరియా, టవర్ సర్కిల్, అన్నపూర్ణ కాంప్లెక్స్, కమాన్ ప్రాంతం, సిపి ఆఫీస్ రోడ్, లక్ష్మీనగర్, రాఘవేంద్ర నగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డు రోడ్డు, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు.. బస్టాండ్ ఏరియా,వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు.. బ్యాంక్ కాలనీ, మెహర్‌నగర్, రెడ్డి ఫంక్షన్ హాల్, సీతారాంపూర్ బోర్డు ప్రాంతం, డి మార్ట్ ప్రాంతం, వావిలాలపల్లి తేజ పాఠశాల ప్రాంతం, రూరల్ ప్రాంతాలలో ఉదయం 9:30 నుంచి 11:30 వరకు ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్ కమాన్‌పూర్, బాహాపేట, చింతకుంటలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

హుజూరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని 26వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్లాన్, నాన్ ప్లాన్ కింద సీసీ రోడ్డు, డ్రయినేజీ నిర్మాణం, ఇతర నిర్మాణాభివృద్ధి పనులకు రూ. 5లక్షలు మంజూరు కాగా, కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సాంబరాజు, వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఆర్డీవో

మానకొండూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరువు శిఖం ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ హెచ్చరించారు. మండలంలోని ఊర చెరువు ఆక్రమణకు గురైందని కొందరు గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి హద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. శనివారం ఆర్డీవోతో పాటు మండల రెవెన్యూ అధికారి బండి రాజేశ్వరితో పాటు పోలీసులు చెరువును పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి చెరువు చుట్టూ కందకం తవ్వించారు.

చొప్పదండి కళాశాలను సందర్శించిన విద్యాధికారి

చొప్పదండి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో, విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణలయ్యే విధంగా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ శరత్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో ప్రపంచ ధ్యాన దినోత్సవం

తిమ్మాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్ ఆఫ్ లివింగ్, కరీంనగర్ వారి సహకారంతో విద్యార్థులతో ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి గంగిశెట్టి అరుణ్ కుమార్, రాజు హాజరై విద్యార్థులతో ధ్యానం చేయించారు. వాగేశ్వరి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైడ్ ఆఫ్ ది నేషన్ అవార్డు అందుకున్న డాక్టర్ ప్రదీప్

సుభాష్‌నగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆసియా టుడే ఇండియాసంస్థ వైద్య రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న ఆసుపత్రికి ప్రతి సంవత్సరం ప్రైడ్ ఆఫ్ ది నేషన్ అవార్డును అందచేస్తారు. ఈ సంవత్సరం జిల్లా కేంద్రంలోని శ్రీసాయి లైఫ్‌లైన్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఎంపికైంది. ఈ అవార్డును ఆసుపత్రి చైర్మెన్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందన్‌రావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కంచన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చీరల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా రాజధాని క్యాన్‌బెరా నగరంలోని హయత్ హోటల్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ చీరల దినోత్సవంలో భారత సంతతికి చెందిన మహిళలు చీర కట్టుతో సుసంపన్నం చేశారు. ముఖ్య అతిథిగా కరీంనగర్‌కు చెందిన డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి-జానకి దంపతులు హాజరై మాట్లాడుతూ పాశ్చాత్య మహిళలు సైతం చీరలు ధరించడానికి ఉత్సాహం కనబరుస్తున్నారని అన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంస్కృత సర్టిఫికెట్ కోర్సుల దరఖాస్తులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆహ్వానం పలుకుతున్నట్లు కరీంనగర్ కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం లక్ష్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి మొదటి వారంలో ఈ కోర్సు ప్రారంభమౌతుందన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు శిక్షకురాలు రమ, 8897393860 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్ డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రంలోని లుథియానాలో ఇటీవల నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ విద్యార్థి పి పార్థు రెడ్డి పాల్గొని విశేష ప్రతిభచాటాడు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి విద్యార్థికి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు.

పాఠశాలల్లో ఫుడ్‌ఫెస్ట్

మానకొండూర్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వివిధ రకాల వంటలు తయారు చేసి పాఠశాలకు తీసుకువచ్చారు. లింగాపూర్‌లో ఎంఈవో మధుసుధనాచారి పాల్గొని వంటకాలను పరిశీలించారు.

● తిమ్మాపూర్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. నేదునూర్, మొగిళిపాలెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వంటకాలను ప్రదర్శించారు.

● శంకరపట్నం: మండలంలోని తాడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు అనేక రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు.

● ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో శనివారం తెలంగాణ ఆహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయిలయ్య, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయ్, టీపీటీఎఫ్ నాయకుడు కోల రాజమల్లు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, టీపీటీ ఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షా అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంకె రామచంద్రా రెడ్డి, ప్రధానకార్యదర్శి వేల్పుల బాలయ్య, అర్కాల శ్రీనివాస్, కోట రామస్వామి, చంద్రశేఖర్, నాగుల శ్రీనివాస్, పరశురాములు, కనకయ్య, ఐలయ్య, రాజిరుడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు డిమాండ్ చేశారు.

●కరీంనగర్ అర్బన్: బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య డిమాండ్ చేశారు.

'బిర్లా ఓపెన్‌మైండ్స్'లో మల్టీకల్చరల్ డే

కరీంనగర్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో మల్టీ కల్చరల్‌డే వేడుకలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ హర్యాన రాష్ట్రాల సంస్కృతులను మిళితం చేసి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు, జానపద కళలు, పండుగలను విద్యలో మిళితం చేసే అట్టహాసంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నీ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.





బహుమతులు ప్రదానం చేస్తున్న ట్రినిటి చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, బాలుడి నృత్యం

అనంతరం స్కూల్‌లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, పలు కార్యక్రమాల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల సంప్రదాయాలను మల్టీకల్చరల్ డే ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాన్నారు. ఇవే కాక దేశంలో సంస్కృతిక సాంప్రదాయ నృత్యాలను ముందుకు విద్యార్థుల ద్వారా చైతన్య పరిచే విదంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా గెలుపొందని విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబితావిశ్వనాధన్, అద్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పారమిత టెడ్ క్లబ్ శిక్షణ అభినందనీయం : కలెక్టర్

కరీంనగర్ టౌన్,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పారమిత టెడ్ క్లబ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో పారమిత హెరిటేజ్ పాఠశాల టెడ్ ఎడ్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇద్దరు, పారమిత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు వారి టెడ్ టాక్స్‌ని అద్భుతంగా ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శ్రీహిత. ఎం, చొప్పదండి కేజీబీవీ విద్యార్థి లక్ష్మిశ్లోక అద్భుతంగా ప్రసంగించారు. టెడ్ క్యూరేటర్ హన్మంతరావు ఆధ్వర్యంలో వారు రెండు నెలలుగా శిక్షణ పొందారు. ఈకార్యక్రమంలో డీఈవో జనార్ధన్‌రావు, అశోక్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, ఎంఈవో గంగాధర్, పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలు

హుజూరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

● వీణవంక: మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద శనివారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో మాడ సాదవరెడ్డి, ముసిపట్ల తిరుపతిరెడ్డి, మాపూరపు విజయ్ భాస్కర్‌రెడ్డి, కట్కూరి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావు, మాజీ సర్పంచ్‌లు కంది దిలీప్‌రెడ్డి, మొగిలి, కందాల కొంరెల్లి పాల్గొన్నారు.

● జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తా, శ్రీసత్యసాయి మానసిక వికలాంగుల పాఠశాల, 12వ వార్డులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆరెస్ నాయకులు శనివారం ఘణంగా నిర్వహించారు.

సంక్షిప్తం

●కరీంనగర్ కల్చరల్: చలికి బస్టాండ్‌లలో, దేవాలయాల బయట, ఫుట్‌పాత్‌ల మీద పడుకున్న నిరాశ్రయులు, అభాగ్యులకు శుక్రవారం రాత్రి కరీంనగర్‌కు చెందిన స్వచ్ఛంద కార్యకర్త గాలిపెల్లి కుమార్ దుప్పట్లను పంపిణీ చేశారు.

● మానకొండూర్: పీఆర్‌టీయూ మండల నూతన కమిటీ శనివారం మానకొండూర్‌లో ఏర్పాటైంది. అధ్యక్షులుగా వరుకోలు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆవల వినోద్‌కుమార్‌లను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోనె శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

● సైదాపూర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల నియామకమైన దొంత సుధాకర్‌ను మండల సమైక్య కార్యాలయంలో ఐకేపీ సిబ్బంది, మహిళలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి ఉన్నారు.

● గన్నేరువరం: మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయ అభివృద్ధికి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన చిట్టిమల్ల సంతోష్ మాధవి దంపతులు శనివారం రూ.25 వేల నగదును విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు,

● శంకరపట్నం: మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో పైపులైన్ లీకేజీతో తాగునీరు వృధాగా పోతోంది. పైపులైన్ లీకేజీతో నీరు కలుషితమవుతోందని అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం కరీంనగర్‌లోని మెడికవర్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించనున్నారు.

● హుజూరాబాద్: తెలంగాణ ప్రజల సమస్యలపై నిలదీస్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసం హరించుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు బి శ్రీనివాస్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మాట్లాడారు.

● చొప్పదండి: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డిని పోలీసులు బైండోవర్ చేశారు. ఇటీవల రైతు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను పోలీసులు బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు.

● గంగాధర: గంగాధర మండలంలోని మధురా నగర్ పరిధి పత్తికుంటపల్లిలో శనివారం భారీ కొండచిలువ ఇళ్లలోకి వచ్చింది. దీంతో స్థానికులు కొండచిలువను పట్టుకుని సమీపంలోని అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.